కన్నడ

ఎదురుగుండా మేడలోఉన్న మనోహరం తల్లి, కూతురి త ఖాతాదారుణ్ణి ఎవడినో, నడిరోడ్డుమీద నిలవేసి నానా పలుపులూ దులుపుతూంది... రాక్షసి గొంతుతో.

పక్క యింట్లోనుంచి, జోలపాట వినబడుతూంది.

డాక్టరు బల్లదగ్గిర కూర్చుని, పాత కేటలాగులు తిరగ వేస్తున్నాడు. నేను కుర్చీలో పడుకుని, హెల్తు మేగజీనుల దొంతి లోనుంచి ఒక్కొక్కటొక్కటే లాగి, బొమ్మ బొమ్మా పరికాయించి చూస్తున్నాను.

...మాట్లాడేందుకు ఏమీ లేక, ఏదో గొడవ పెట్టుకుని, భోజనంవేళదాకా ఎవరి త్రోవను వారు, ప్రొద్దు బుచ్చుతున్నాము.

—ఆ అబ్బాయి వచ్చి ... నమస్కారం చేశాడు. డాక్టరు ఎదురుగుండా కుర్చీ చూపించాడు. నేను తల ఎత్తి చూసి... మళ్ళా బొమ్మ మీదికి వెళ్ళిపోయింది చూపు.

“ఏమయ్యా!...ఏమిటి?” అని అడిగాడు డాక్టర్.

“ఏమీ లేదండీ...” అన్నాడు ఆ పిల్లవాడు : పిల్లవాడంటే, పసిపాపకాదు : మా కన్న చిన్నవాడు ... మీసం స్తూ వస్తూ ఉంది.

హుంకారం, గొంతులో గొరగొర లాడించి, డాక్టరు తనపని తాను చూసుకుంటున్నాడు.

"మీతో - మాట్లాడాలండీ" అన్నాడు ఆతడు, కొంత సేపటికి తటపటా యింపులో నుంచి తెమిలి-

"మాట్లాడు!" అని డాక్టరు కసురుకున్నాడు.

"ఒంటరిగా..."

"అయితే...ఎవరూ లేనప్పుడు రా..."

"ఎప్పుడండీ .."

"ఎవరు లేనప్పుడు ..."

-నేను, పాకం ముదురుతున్నదని, అక్కడనుంచి లేవ బోయినాను... "కూర్చో" అని నన్ను కూలేసి... "మంత్ర సాని ముందర...ఆసామెత తెలుసును కాదూ... యిందాకా వచ్చి యిప్పుడు బిడియ పడతావేం .. ఫరవాలేదులే... మా వాడూ వైద్యుడే... ఘన వైద్యుడు!...ఒకరిద్దరిని కాదు... రోజూ పదిమందినైనా చంపుతూంటాడు...మాటలతోనేలే.."

డాక్టరు మాటలకు ఆ కుర్రవాడు ... నవ్వాడు: హుమ్యామరు వాడి మొగంలాగా ఉన్నా ... పరాయివాడున్నప్పుడు, బాగుండదని ... నేనూ నవ్వక తప్పిందికాదు.

"మరి...ఒంట్లో బాగుండటం లేదండీ-"

"ఆలాగేం పాపం..."

"చాలా రోజులనుంచీ..."

"అయితే యిన్నాళ్ళూ ఏం చేశావు ?"

"సిగ్గుపడి...దాచుకుంటున్నానండీ..."

"ఊఁ. పొడి అక్షరాలేం..."

"-అంటే...అంతే, చేసేటప్పుడు ఏం తెలుస్తుంది"

"నేను-ఏమీ జేయలేదండీ..."

"ఏం చేయలా...చెడు సందులల్లోనుంచి నడవటం...పాడుచోట కాలు ముడవటం ... అదన్నా లేదూ... ఊరికే నిన్ను వెదుక్కుంటూ గాలిలో ఎగిరి వచ్చినవా ?-"

"ఏమోనండీ..."

"అడిగినదానికి ... అదా జవాబు" అవును, కాదు, అని ఖచితంగా చెప్పాలి కాని...మళ్ళా, చదువుకున్న వాడవు!"

"అడగండి..."

"ఏమిటి అడిగేది ? నీ..."

-స్ఫురించింది: అవతల వాడిని హడల గొట్టడం, తాను సర్వజ్ఞు ణ్ణనుకోవడమూ...సర్వసాధారణంగా స్టెతస్కోపు పట్టనేర్చిన ప్రతి వెధవాయలోనూ అంతో యింతో ఉన్నదన్న మాట, జగమెరిగినది. మా వాడిలో ఆ హంశ మరీ ప్రకో పించి ఉంది...

ఇక, నేను కలుగ జేసుకున్నాను. లేకపోతే ఆ సంభా షణకు...అంతూ పంతూ ఉండదు...

ఆ అబ్బాయిని బుజ్జగించుతూ-

"అవునయ్యా ! డాక్టర్లంటే ఏమన్నా ఆకాశంలోనుంచి ఊడి పడ్డారా ? వాళ్లూ మనలాటి మనుష్యులే ! మళయాళ మంత్రాలేమీ చెప్పరు వాళ్ళకు బళ్ళో, అవతలవాడి మను సులో ఏమున్నదో చెప్పకుండానే గ్రహించే టందుకు. అది

గాకుండా మెదడంటే ఏమిటో, దాని మంచిచెడ్డలూ సున్నితమూ . . . ఎంతో కృషిచేసి తెలుసుకున్న వాళ్ళు కనుక, దానిని ఎంతో భద్రంగా కాపాడు కుంటారు, కాని, నీలాగా, నాలాగా, అవసరం ఉన్నా, లేక పోయినా. . . అతి విరివిగా వాడేయరు: గనుక, దీనివల్ల మనం ముఖ్యంగా నేర్చుకోవలసినది ఏమంటే:- వైద్యుడికి, రోగనిదానం తెలుసుకునే ప్రయత్నంలో, రోగి సర్వవిధములా తోడుపడి . . . ఆమాట అతనికి దక్కనివ్వాలి: తెలిసిందా ? — మనం అంటే ప్రకరణాన్ని బట్టి . . . నీవే . . . యిక కానీ. . .!"

డాక్టరుకు నన్ను మింగేద్దామన్నంత కోపంవస్తూంది. . . కవళిక కనిపెడుతూనే ఉన్నాను. కాని, మనం గుడ్రమింగే రకం: ఏం చేస్తాడు పాపం ?

ఆపిల్లవాడు దాచకుండా అంతా చెప్పాడు. చెప్పినదంతా మావాడు సావధానంగా, అర్ధ నిమీలిత నేత్రాలతో,విన్నాడు.

'ఊం. . .కలలు వస్తూంటాయా?'

'ఆం...'

'ప్రతిరాత్రీ...'

'అవునండీ...'

'కలలు, మారుతూంటాయా...'

'సాధారణంగా. . .లేదండీ'

'—ప్రతిరోజూ.. సత్తువపోతూండటం... ఎంతైనా నీరసించిపోతావు. యిప్పటికే చాలా ముదిరింది, కాని, ఫరవా లేదు, అయితే చాలారోజులు మందు పుచ్చుకోవలసి

ఉంటుంది...' అని శ్రీవారు సలహా చెప్తున్నారు. ఆ పిల్లవాడు అమిత ఆదుర్దాతో, అన్నింటికీ తల ఊగించుతూన్నాడు.

'అత్తవారింటికి పంపితే'. . . అని నే నన్నాను. మా డాక్టరు, ఎకసెక్కెంగా నవ్వాడు. ఆ అబ్బాయి, చాలా సిగ్గు పడ్డాడు...

'నీ పేరేమిటి . . బాబూ . . .'

'చంద్రశేఖరం'

'బాగుంది...మరి, నక్షత్రం?'

'రోహిణి...'

'అంటే, ప్రస్తుతం, నీ అభిమాన నక్షత్రం . . . జన్మనక్షత్రంతో . . . మన వైద్యానికి పనిలేదు . . . చెప్పు . . . సంకోచించవలసిన అవసరం లేదు. పైగా...చాలా...అవసరం...'

'—మరీ సిగ్గు పడుతున్నాడు; నామాటలకు, డాక్టరు 'వీడికేమన్నా మతిపోయిందా ఏమిటి' అని నావంక చోద్యంగా చూస్తూన్నాడు . . .

'నీవు చెప్పనక్కరలేదులే. నేను కనుక్కో లేకపోయినప్పుడుగదా...' అని నవ్వుతూ, దగ్గిరకు వెళ్ళి, అతని జేబులో నుంచి, పర్సుతీసి...తీసి... అందులోనుంచి ఆబొమ్మ బయటకు లాగాను... 'మంచి పోజు సంపాదించావు' అని ప్రశంసించి . . . తిరిగి ఎక్కడి వక్కడ పెట్టేసి...అతి శాంతంగా...'డాక్టరుగారు చెప్పినట్లుగా నడుచుకుంటే మూడు నిమిషాల్లో...నీఒళ్ళు మళ్ళా. నీవు చెప్పినమాట వింటుంది. ఆయన హస్తాల్లో అశ్వినులు (ఆలోకం ఇవాక్యుయేట్ చేసివచ్చి ప్రస్తుతం టెంపొరరీగా)

కాపురం ఉంటున్నారు. (కుండలీ కరణం, స్వగతంలో జమ) నీ అదృష్టం కొద్దీ దొరికాడనుకో. యింతకూ నీకు బాగుపడే యోగం ఉండబట్టే ఇక్కడకు వచ్చావు. రేపు మంచిది. దుర్ముహూర్తం వెళ్ళగానే, రా. మందు ప్రారంభంచేస్తారు...'

—యింకా. యింకా మాటలతో యిలాగే చక్కిలిగింత బెడుతూ గుమ్మందాకా, ఆతణ్ని సాగనంపివచ్చి, యధాస్థానంలో కూర్చున్నాను.

'నీ సావాసం కొట్టేస్తానురా. మంచిరోజు చూసి...'అని, బుంగమూతి పెట్టాడు, డాక్టరు.

'మంచిది...ముహూర్తం పెట్టించుకురానా?'

'పోరా...క్వాక్! నీలాటి స్నేహితుడు ప్రక్కనుంటే ధన్వంతరితాత అయినా... మరునాటికి . . . చదువుకున్నదంతా, మరిచిపోతాడు.'

"—బాగుపడతాడు. ఒరేయి భిషక్! నీరంగు నీళ్ళతో కనుక వాడి ఒళ్ళు నయమైతే...యిదిగో యీ కుడిచెవి ఉందిచూడు... సమూలంగా .. నీచేతులమీదుగా ముమ్మారు తెగ్గోయించుకుంటాను...

—భోజనంచేసి, నాదోవను నేను వచ్చేశాను, సంవత్సరాది పండుగపూటా,ఏదో లోపలికిపోయి యిల్లాలితో మాటా మంచీ అడుకునేందుకు లేకుండా, యీ బ్రహ్మచారి పొత్తు ఎందుకని... డాక్టరును విడిచి...

పదిహేను రోజులదాకా... ఊళ్ళో లేను.

—వచ్చిననాడు సాయంకాలము ... పోరుగుపేట వెళ్లి పనిచూసుకుని తిరిగి వస్తూండగా ... ఆపిల్లవాడు, లోపలనుంచి త్రోవను నేను పోతూండటంచూసి... గబగబావచ్చి నన్ను పలుకరించి... వాళ్ళ మేడమీాదకు తీసుకువెళ్ళాడు.

యిల్లు చాలాబాగుంది. ఆతవిగది, కలకల లాడుతూంది. బాగా, కలిగిన కుటుంబంలాగా ఉన్నది.

టీ వగయిరాలు, యితర పరికరాలూ, పుష్కలంగా బల్లమీాదకు తెప్పించాడు. మొగమాటపడకుండా, మాంచి పట్టుపట్టడంచూసి, ఆతడు, చాలా చనువుగా నాదగ్గిర కూర్చు న్నాడు. నేను కుర్చీలో నడుమువాల్చి... పొగలో మునిగి, గోడలమీాది బొమ్మలవంక... ఒక్కొక్క చిత్రాన్ని ఎంతో నిదానించి... చూస్తున్నాను.

అన్ని మొగాలూ ఒకటే; అవతారాలుమారినా అంతా ఆ అమ్మాయే!

నావంక చూస్తూన్నాడని గమనించకపోలేదు. చూడ నిచ్చాను తీరుబడిగా. చూడటం అంతా అయిపోయిన తరువాత ఆచూపే చెప్పవాల్చకుండా ఆతనిమీాదకు మరల్చాను. చూ డ లేకపోయినాడు.

-బాగున్నాయ్. అన్నీ బాగున్నాయ్! భలే బాగు న్నాయ్.

—గోడమీాద బొమ్మలవంక చూస్తున్నాను. బొమ్మ లను చూసిన చూపుతోనే ఆతన్ని చూస్తున్నాను. అన్న మాటే... అంటున్నాను.

'ఏమయ్యా! ఏలా ఉన్నావు!' అన్నాను.

'బాగానే లెండి ...'

—ఆమాటలోఉన్న విసువు, ముందు, కనుక్కోలేక ఉలికిపడి, చెవి తడుముకున్నాను. కాని, ఆతని కవళిక చూసి తెప్పరిల్లి ధైర్యం పైకి కనబడనీయకుండా.

'హుఁ...చాలా సంతోషం. యిప్పుడు యిబ్బంది లేమీ లేకుండా రాత్రిళ్లు సుఖంగా నిద్రపోతున్నావన్న మాటేనా?...'

'చూస్తే తెలియడంలేదూ, మీకు...' అన్నది ఆతని చూపు.

అవును, వెనుకటిలాగానే ఉన్నాడు. అంతకన్నా కూడా బుగ్గలు మరీ యీచుకుపోయి నడుంవంగి కళ్లు కళాకాంతులూ లేక . . .

'తెలుసునులే' అన్నట్టు తల ఊగించాను.

'మందు మానేశాను' అన్నాడు, కొంతసేపటికి మాట తెముల్చుకుంటూ.

'మంచిపని చేశావు.'

—నావంక, ఆశ్చర్యంతో చూశాడు. మా స్నేహితుడికి, ఆవచ్చే నాలుగుడబ్బులూ పోయినవని, నాకేమన్నా ఆతని మీద కోపం వస్తుందనుకున్నాడో, ఏమో, నేను ఆశంక ఆతని చూపులలో గ్రహించి ఆమాటనే రెట్టించాను.

'మంచిది యిక వెళ్ళిరానా' అంటూ గడియారంవంక చూసి లేచాను — వీధిలోకి వచ్చాను. నన్ను నాలుగడుగులు సాగనంపే మర్యాదతో, నా వెంటనే నడుసున్నాడు.

త్రోవలో ఏదో జ్ఞాపకం వచ్చినట్లుగా ఆగి ఆతనితో 'రేపు విజయనగరం వెళుతున్నాను ... మనకి, ఓ స్నేహితుడి ధర్మమా అంటూ రెండు టిక్కెట్లు ఉల్ఫాగా వచ్చినవి ... నీవు కూడా వస్తావా ఏం...సరదాగా, పోయివద్దాం...యిప్పుడు సెలవులేకదా నీకు...' అని అడిగితే, ఆతడు...ఏలాగో తప్పించు కుందామని చూశాడు. కాని...చివరకు ఒప్పించాను. మన నాలుక మీద . . . పంచగ్రహకూటం. .పీఠం వేసుకు కూర్చుం డగా...మాటవినక పోవడానికి...మహా మహులకే అలవి కాలేదే . . . ఆ కసుగాయకు, తరమా? —

'మంచి'దంటే, 'మంచి' దనుకుని...ఆతన్ని యింటికి మళ్ళించి ... నేను మా డక్టరు దగ్గిరకు వెళ్ళాను...

'ఎప్పుడు ..రాక' అన్నాడు ... సోదరుడు...మోటారు సైకిల్ స్టార్టరును, కాలులో సాముచేయిస్తూ... ఎక్కడికో బయలు దేరబోతూ...

"రాకరాక ... నిక్షేపంగా ఒంటి బ్రాహ్మడు ఎదురుగా వస్తే...దిగరా గుర్రం..."అని పలుకరించి, కలిసి లోపలకి వెళ్ళాను...

'ఎప్పుడొచ్చావురా ?...'

'ఎప్పుడు వెళ్ళానో...చెప్పనా ?'

'నీ ముఖంలే...'

నా ముఖమేనయం... నీ చేతిమాత్ర పడలేదో... యింతవరకూ ఏదో యిలా బ్రతికిపోతున్నాను ... లేకపోతే నీ

ముఖమే నాముఖం... యింతకన్నా ఉంది...యిప్పుడు మును పటికన్నా లక్షణంగా... ఆ చోద్రాముఖం...'

'వాడా... నీకెక్కడ తగిలాడు... అప్పుడే...'

'తగలడం... పరస్పరం!... మొత్తానికి... నేను అను కున్నంతా అయింది!... పాపం, వాడేమీ నీమీద చాడీలు చెప్పలేదు కాని... ఎందుకూ, అద్దం ఉంది, ముఖం ఉంది వేరే అడగాలా?...అంతటితో నైనా... దయదలచి వదలావని విని...చాలా సంతోషించి... నీ సౌదర్యాన్ని నీ యెదుటనే వేనోళ్ళ పొగడదామని...హుటాహుటి నడలన్ ఇక్కడకు దయ చేశాను...'

'ఒరే...నా శాయశక్తులా... ప్రయత్నంచేసి చూశాను సామ కామోపాయాలతో...'

'భేషో!... ఎవరా కామి?'

'ఎవరు?...ఎదురుగా ఉన్నవారే... పెళ్ళికూతుళ్ళు'

'ఏ కూతురు...'

'శకుంతల...'

...అరే... పాడి కర్మంకాలి... చివరకా దీపం సెమ్మెమీదకా... నీవు తోసింది...'

మిత్రమా! తియ్యని వ్యాధులూ, కమ్మని మందులూ ఉంటాయా? ఎవరైతే నేం ..ఔషధం...కళ్ళు మూసుకొని... మ్రింగవలసిందే...'

'తప్పకుండా... యింకా వాడవలసిందే యీ పాటికి అనంతరం బో ఢేవా?...

‘ఆ దేవుడు . . . అప్పటి నుంచీ . . . అసలు ముఖం తప్పించాడు. . ఇదిగో. . . ఇక రెండు రోజులు చూసి . . . బిల్లు పంపించుతాను. కందకు లేని దురద, చామ కెందుకు, మధ్య ?—’

‘—చామకు, దురదంటూ రేగాలిగాని . . . అప్పుడు కంద, మందులోకైనా పనికిరాదు. . . బిల్లు ఎక్కడికీ పోదు గాని, యింకో పదిరోజులు పోనీ... అంతలో పాపం పెరిగినట్టు యింకా పెరుగుతుంది. . .’

“ఎవరిపాపం?”

‘— పాపం పోనీ అని... దయదలచి, మీకు బిల్లులు చెల్లించే వాళ్ళది...’

“చెల్లించడం పాపమో పుణ్యమో, ఆదైనా నీలాటి సైంధవులు అడ్డుపడకుండా ఉంటేనే...’

‘అడ్డుపడటం చేతనైతేనే. . . తలంచుకుంటే ఎవరైనా ఒడ్డు ఎక్కించ గలిగేది. . .’

ఇన్స్పెక్టరు వెళ్ళిపోయినాడు.

మూడోనాడు సాయంకాలము.... నేనూ చంద్రశేఖరం... విజయనగరంలో ఉన్నాము....

‘ఎక్కడికి వెళదాం ?’ అన్నాను. స్టేషను నుంచి ఊళ్ళోకి వెళుతూ.

‘మీ యిష్టం.’ అన్నాడు.

‘నా యిష్టం... నీకు యిష్టమైతే...’

—యింతలో నాకు ముఖ్యుడైన స్నేహితు డొకడు తగిలి. . . మరునాడు మధ్యాహ్నం దాక . . . రాజోపచారాలతో. . .ఆతని యింటిలో మమ్మల్ని యిద్దరినీ ఖైదుచేసి. . . కాలక్షేపాలలో ఎక్కడికీ తెమిలి కదల నిచ్చాడు కాదు.

. . . బట్టలు వేసుకు, నేను బయలుదేరుతున్నాను. 'నేను కూడా రానా ?' అని. . . మొగమాట పడుతూ అడిగాడు శేఖరం : రమ్మని తల ఊగించి. . . బండిలోకి ఎక్కబోతూండగా. . . 'ఎక్కడికి ?' అని మళ్లా అడిగాడు. . .

'ఒకటి, బయలుదేర బోతూన్నప్పుడు బొట్టూకాటుకా పెట్టి పిలిస్తేనేకాని కదలకపోవడం, వెళ్ళబోతూ 'ఎక్కడి' కనడం ... రెండూ మంచి శకునాలే...శుభ సూచనలు ముందే కనబడుతున్నవి.' అంటూ విసువుతో మంటగా కసిరాను.

'తెలియక అన్నానండీ'...ఆతనికి, కళ్లనీళ్ళ పర్యంత మయినది.

తెలిసో, తెలియకో యిప్పుడు అనుకునిమాత్రం, ఏం లాభం? —ఎలైనా, . . . నీ మంచికోసమే కాని . . .'

నేనన్నది . . . అతనికి ఏలా అర్థం అయిందా? నావంక, చూసి. మాటాడకుండా, బండిలో యింకా పైకిపోయి కూర్చున్నాడు.

అమాయకత్వం చూస్తే . . . జాలి వేసింది. బుజ్జగింపుగా . . . మనం ఎక్కడికి వెలుతున్నామో తెలుసునా? అని మాటలు ప్రారంభం చేశాను.

అతడు తల ఎత్తి చూసి . . . ఊరుకున్నాడు.

"మనం వెళ్ళేది. . , అక్కడికే. . ."

" _ ఎక్కడి"కని. . . తల ఊగించాడు.

నేను కొంచెం నవ్వుగా. . . "ఆ అమ్మాయిని, యిది వరకు ఏన్నడన్నా చూశావా? . . .తెరమీదా. . .కలల్లోనూ కాదు, నేననేది. . .మనిషి.. నిండునిలువు"

వింటూ చిరునవ్వు నవ్వాడు . . చివర అన్న వాటికి. . , చిన్న పుచ్చుకున్నాడు. నేను. . .చేత అంకుశం అప్పుడప్పుడే, వదలదలచుకోలేదు.

"అసలు. . . ఆ పిల్లది యీ ఊరేనన్న సంగతైనా తెలుసునా? - తెలియదూ?. . .ఎవరినన్నా అడగలేకపోయినావా? . . .యే సినిమా పత్రికవాళ్ళకి వ్రాసినా, మరునాటికి జవాబు వచ్చేదే. . .పోనీ కేరాఫ్‌వారి కంపెనీకే ఉత్తరం వ్రాయకపో యినావూ? . . .మూడోనాటికి ముత్యాలలాటి అక్షరాలతో సంతకమై ముద్దొచ్చే బొమ్మవచ్చేదే? దానికి మంచి ఫ్రేము వేయించినా అందమూ, చందమూ, కాని, అచ్చు అయి కాగి తాలలోనుంచి కత్తిరించి. . . గోడకు అతికించుతే—ఏం ఫలం? . . .ఊఁ. . .మంచిదాని మీదనేకన్ను వేసావులే. . .చిదిపి దీపం పెట్టవచ్చును. పైపూతలవల్ల వచ్చిన కళ కాదది. . .అసలు పిల్లది, మెరిసిపోతూ ఉంటుంది. . .చూస్తావుకా. . .?

ఆతనిని. . .కనిపెడుతూనే ఉన్నాను. నా మాటలతో గిలిగింతలై. . .పిల్లవాడు లోలోపల కిలకిలలాడ పోవడం. . .కళ్ల మెరపులో. . .ఉబలాటం దాచుకోగలిగినంత ధాయిష్టా ఏం?—

—ఎండ మండిపోతూన్నది. గుమ్మంలోనే బండిదిగి. . . అతని చేయి విడవకుండా పట్టుకుని లోపలికి ప్రవేసించి . .ఎదురుగా ఎవరూ కనబడకపోతే. . .మనరాక తెలిసేందుకు . .గొంతు సవరించుకున్నాను.

పక్కవసారా వేపునుంచి . . . తలుపు తీసుకుని . . . వాళ్ళ అమ్మ. .తలుపులు వేసుకు పడుకున్నది కాబోలు చీకటిలోంచి వెలుతురులోకి రావడంలో, చూపు అనడానికి కళ్ళు చికిలించుకుంటూ. . . చూసి పోల్చుకుని. . . దగ్గరకు వస్తూ...'త్రోవతప్పి వచ్చారులాగుంది. . .' అంటూ పళ్ళెమంత ముఖంచేసుకుని. . . మాకున్న స్నేహాన సరసమాడి. . . చేతులో ఉన్న విసనకర్ర. . . అందించింది. కూర్చున్నాము. . .

'దాహం కావాలా ?'

'ఎంత త్రాగినా. . . దాహం తీరుతుంది గనకనా'

'పోదురూ. . . మీకు. . . తల నెరిసినా, యింకాచిన్నతనమే...' అని మరీ చొరవగా మాట రానిచ్చి. . . నాలుక కొన పంటితో నొక్కుతూ. . . సంకోచంతో. . . "ఏ రెవరు?' అని శేఖరాన్ని సూచించింది. . .

'ఎవరైతేనేం. . . నాతో వచ్చినప్పుడు. . . నా అంత వారన్నమాటే కాదూ. . .'

'నూరు ఆరైనా. . . మీ అంతవారు మీరే. . .అందరికన్నా. . . అయిదాకు లెక్కువ చదివితిరి!, , .'

‹మన చదువు ఇతరులకు ఒంట పట్టింది, కాని. . .›—
గా ముసలి సరసాలకి అంతు అంటూ ఎప్పటికి ఉండేదో కాని
ంతలో. . . అవతలనుంచి. . . ‹ఎవరే అమ్మా!—› అను
ంటూ, ఆ అమ్మాయి. . . గుమ్మంలోకి లోపలనుంచివచ్చి
క్కడే అగి. . . నన్ను చూసి. . . ఏనుగనెక్కినంత సంతో
ంగా . . చంద్ర బింబంగా ముఖం చేసుకుంది. . .

శేఖరం కళ్ళకు. . . ఆ అమ్మాయి కనబడటం. .

ముఖమంతా నీళ్ళు కారుతూన్నవి. . . ంోడుకున్న
ాడీ తడిసి ఒంటికంటుకున్నది . . ఒళ్ళూ ముఖమూ సూది
యినమోపే సందులేకుండా. . . పేలి, కందగడ్డలాగా. . . బాడీ,
ప్పకుండానే. . . వీలయినంతవరకూ వీపుమీద, మెడదాకా
గసన దోసుకుని. . . దువ్వానతో, చేయి వెనుకకు మెలివేసి
ోక్కుంటూ. . . దురదలో హెచ్చుతగ్గుల తికమకలు ముఖ
వలికలో. . . పెదవి విరుపుల్లో ప్రకటించుతూ. . . తలంటి
ోసుకున్న జుట్టు. . . పైనంతా రేగి . . . అలకలు కళ్ళదాకా
ంటుకుని. . . చెవులూ ముక్కు. . . బోసిగా. . .

—అదీ. . .చూడటం శేఖరం. . .సుభద్రా కుమారిని

'రా...సుబ్బులూ! యిక్కడ పరాయివాళ్ళెవరూ లేరులే!
యా అబ్బాయి, నిన్ను చూడాలని మా ఊరునుంచి గంపె
ాశతో, వచ్చాడు. ఆస పెట్టింది నేనేననుకో. ప్రౌఢ్యాసర్లను
ప్పతిప్పలా పెట్టి మూడు చెరువుల నీళ్ళు త్రాగించుతూ,
[illegible]

ర్శించ వీలవుతుందా?, అని యీతడు నిరాశ చేసికున్నాడు. కాని. . .నేను, "మరేంమునిగిపోలేదయ్యా! యిప్పుడంటే యిలా ఆకాశానికి అంటిందికాని సుబ్బులు నా కళ్ళముందర పిల్ల కాదూ పరికిణీ కట్టుకోకుండా నా ముందర తిరిగేదే. దానిల్లు బంగారంగానూ, యిప్పు డింత యిదైనా మనం వెళితే ఆమాత్రం దరిశనమైనా యివ్వదా! ఏం చూదాముగా? అని హామీ యిచ్చి తీసుకువచ్చాను. రా వచ్చి యిలాకూర్చో. యింటికివచ్చిన పెద్దమనుషులకు మరియాద చేయడం...ఏంకావాలో, పళ్ళో, పాలో ఏమీ కనుక్కోకుండా యింకా చిన్నతనమేనా? పెద్దగా పేరుమ్రోగి. . .'

సుబ్బులు...సినీమా నడకతో వచ్చి శేఖరం బారున కూర్చున్నది. ఆతడు కూర్చున్నచోట, ఆమె ఎక్కడ తగులుతుందో అని ఒళ్ళు కుదించుకున్నాడు, నేను నవ్వు ఆపుకున్నాను.

"ఎంతపేరుమ్రోగినా అదంతా మీ చలువే. దానికి యింకా నేర్చుకోవాలీ యింకా బాగా పైకి రావాలీ, అని ఎప్పుడు అదే ఒకటే ధోరణి కాని అందరిలాగా నిక్కనీలుగులూ నేర్చిన పిల్లకాదండీ అయినామీరు ఎరుగని దున్నది కనుకనా? అని తల్లి అందుకున్నది: "అవునులే—అబ్బే! దానికవేమీ లేవు నేనెరుగను గనుకనా" యీ, లాటి అతుకు మాటలు; నడుమనడుమ విసురుతూ మాటకు అడ్డంవచ్చి. . ,

"మళ్ళా ఎక్కడా బుక్ కాలేదా?" అని ఆ అమ్మాయిని పలుకరించాను. సుబ్బులు తల్లివంక చూసింది.

'-వీళ్ళకు సమాధానాలు చెప్పలేక నాపని అవుతున్న
దండీ... ఏ పూట కాపూట ఎవరో ఒకరు రావడం...ఎం
తైనా యిస్తాం పిల్లదాన్ని పంపించాలి అని ప్రాణాలుతీయడం...
తెరమీద ఎక్కి-ఏదో తైతక్క-లాడి రావడమా కావలసింది
మనకు ? ... దానికి ఎవరు బడితే వాళ్ళు తయారు: మనకు
డబ్బే ప్రధానం కాదుకదా!— ఏదో ...మంచి చోటుచూసి...
అన్నీ కలిసివచ్చేటట్టుగా ఉంటేనే గాని...అమ్మాయి యీ
మారు కదల నంటూంది . . . దాని అవసరం ఉంటే — దాని
కాళ్ళ దగ్గరకే వస్తారు .. వచ్చారో ... దేశాన్ని దోచు
కున్నారో ! అమ్మాయి పేరు చెపితేనే ... కనక వర్షం కురు
స్తుంది ... ఎవ రెరుగరు గనుక ?—' (... అన్నింటికీ తల
ఊగించడమే తప్ప, జవాబు చెప్పడానికి అందులో ఏమున్నదీ ?
ఎవరిని కదిలించినా వచ్చేది ఆపారమే !... ఎవ రెరుగరు ?—)

—రాచకార్యం అయిపోయింది . . . కాఫీ . . .గీఫీ . . .
ఎండకూడా, చల్ల బడుతుంది:

'వెళ్ళి—వస్తాను . . .

'అప్పుడేనా . . .' అన్నది, తల్లి. ఈపూటేనా' అన్నది,
కూతురు . . .

'—ఎన్నాళ్ళున్నా మీయింట్లో, ఎప్పటి కప్పుడు పర
గడుపే . . . అని తల్లి వేపు చూసి నవ్వి . . . సుబ్బులతో
—'అవును. నేను . . . యీవాళ బండికి వెళ్ళుతాను, మరి, యీ
పిల్లవాడు . . . నాలుగు రోజుల పాటు యిక్కడ ఉంటాడు...
మీకు తీరుబడిగా ఉన్నప్పుడు, చూసిపోవడానికి...వస్తాడు...'

అని, ‘రావడం నీకు యిష్టమేనా ?’ అని చూపులతో ప్రశ్న వేశాను . . .

—తల్లి నవ్వింది : సుబ్బులు కిలకిలలాడుతూ, అల్లరి పిల్లవాడిని బెదరించటం లాగా. . . నావేపుకు చేయి విసిరింది; నేను దూరం కావడంచేత తడవ లేదు కాని, శేఖరం ముఖం నిండా. . . చేతిచెమ్మట. . . ఒత్తుగా జల్లుకుంది.

—‘ఉండే నాలుగు రోజులూ . . . యిక్కడే ఉండ మనండి: . . ఏమీ లోపం చేయముకదా . . . మాకు కలిగిన దాంట్లో. . .’ అని అన్నది. . .తల్లి. . .

నేను శేఖరంవంక చూశాను; అందు కత డేమంటాడో అని; —‘నేనూ బయలుదేరుతానండీ. . . మీతోనే .. యింటి దగ్గిర మా అమ్మ బెంగపెట్టుకుంటుంది. . .’అని, నాకన్న ముం దుగా లేచి నిలుచుని వీధివేపు దోవతీశాడు. . .

‘యీ. . .ఊరు బాగుండలేదు కాబోలు, ఆ అబ్బాయికి . . .’ అని యీసడింపుతో అన్నది తల్లి. సుబ్బులు నవ్వుతూ. . . క్రింద చతికిలపడి కూర్చుని. . . కుచ్చెళ్లు మోకాళ్ళపైకి లాగి. . . దువ్వెన పెద్దపళ్ళతో. . .చర్మం గీరుకుపోయేటట్టుగా గోక్కుంటూ . . .యికిలిస్తూ. . .

తల్లి, గుమ్మందాకా నన్ను సాగనంపటానికి వచ్చింది; శేఖరం అప్పుడే . త్రోవనపోయే ఏదో బండి ఆపి అందులో ఎక్కి కూర్చుని. . . ముందునుంచి. . . నన్ను తొందరపెడుతూ తొంగిచూసి, రమ్మని తలఊగించాడు. గుర్రం బెదిరినట్టుగా. . . బండీ పరుగెత్తుతూంది. శేఖరం, పరధ్యానంతో, మాటాడకుండా . . .

...ఎక్కడో చూస్తున్నాడు. ..నా గో, నేను మాటాడుకుంటున్నాను —.

—'నయమే ...సుబ్బులు ఒళ్లు నిరుటిలాగా పేలలేదు. పాపం క్రిందటి వేసంగికి ...ఎక్కడబడితే అక్కడ సెగ్గడలు... కళ్లూ ముఖమూ వాచిపోయి...ఒంటి చీరె నిండా నెత్తురు డాగులూ ... అసలు ఒంటిమీద గుడ్డఅయినా నిలిచిందా... చూసేవాళ్ళకే రోతపుడితే... దాని కది యింకా యెంత బాధపడిఉండాలి?—

'యింతకూ దానిననడం దోషం...తల్లి చెరిపేసింది... బొడ్డూడక ముందునుంచీ ... చుట్టకాల్చడం ... నల్లమందు వేయడం నేర్పితే...అవి అన్దరికీ పడతాయా: అవిఅయినా, పోనీ, రోజుకు ఏ ఒకటో రెండో అయితే అనుకోవచ్చును... మూరెడూ బారెడూ...మగవాళ్ళకన్న ఎక్కువగా - రోజల్లా ఒహటే తగలేయడం...కుంకుడుకాయలంత ఉండలు మింగడం ...ఏమన్నాఅంటే...యీ దేశంవాళ్లకు యింతే, మీకు తెలియకపోతే చూస్తూ ఊరుకోండి.. తెరనెత్తే మీకూ...మొదలెట్టండి...' అని మంచిగా. 'త' అని బుద్ధిచెప్పబోతే... నామీదికి రయ్యమని లేస్తుంది ఆ ఇంకా కొంతమెరుగు కాదూ .. అందరిమీదలాగా.. మీద, ఆతల్లీకూతురూ విరుచుకుపడి...బూతులకు రేగి .. వాళ్ళముందు ఎవడు నిలువగలడు ? —వాళ్లనోటికి ఎవరు సమాధానం చెప్పకలరు?—

'సరే...యిప్పుడు పులిమీది పుట్రగా కొత్త ఎద్దడి కూడా వచ్చిపడిందా!...ఏంలక్షణంగానన్నా ఉంది...యిది...

సీనికి పుట్టిన తెగులేకాని... సినీమాల్లో వేషాలు వేశే వాళ్ళందరూ ...ఆలా ఒళ్ళు తెలియకుండా తాగు తారా ?— అలా అయితే ఎంత సంపాదించినా ఆగుతుందా ?...

'ఏమిటో...వీళ్ళని తలచడంకూడా పాపమే అనిపిస్తుంది ఒక్కొక్కప్పుడు. ఆలా అనుకుని మానేస్తున్నామా ? దాలిగుంటలో కుక్కలాగా...అప్పుడలా అనుకోవడమే కాని ... తరువాత, బుద్ధి, మళ్లా దానంతట అది గడ్డితింటూనే ఉంటుంది... ఏమిటో...యీ బ్రతుకు... యిందులో, యిన్ని ... అతుకులూ "

—అర్థంలేకుండా... అసందర్భంగా ... అడ్డదిడ్డంగా ... కొన్ని అబద్ధాలు...బండిదిగేదాకా... విడవకుండా, ఆతనికి వినబడుతూండేట్టుగా...నాలో నేను గంద్రగోళం చేసేశాను. రైలు ఎక్కి ... ఊళ్లోదిగి... ఎవరి త్రోవను వారు యిళ్లకు వెళ్లిపోయినాము.

— నెల్లాళ్ళకు :

... తెరమీాద ... ఆ త ని పోలికఉన్న బొమ్మ చూసి... డాక్టరుకు శేఖరంమాట జ్ఞాపకంవచ్చింది. 'పుచ్చుకున్నన్నాళ్ళు - పుచ్చుకుని, అజాపజా తెలియకుండా పోయి వాడు చూడరా, వాడు; యీ పాటికి మంచం ఎక్కి ఉంటాడులే... అని అక్కసుతో మాటాడాడు.—'అవునోయ్! దేవర ఔషధమే సేవిస్తూం టే. . . యిప్పటికి, నీవన్నంతపనీ తప్పకుండా

అయేది...' అన్నాను... డాక్టరుకు, త్రాగుతూన్న, సోడా...
... రోషంమీాద కొరమారి... ముక్కుల్లోంచి, నోటినుంచీ త్రాగినదంతా గళబిళగా... ఉమ్మివేశాడు...రోజాడు.

గేటుబయటికి వచ్చాము... శేఖరం, సైకిలుమీాద ఎక్కబోతున్నాడు... నన్ను చూచి... ఆగి, దగ్గిరకువచ్చాడు. డాక్టరు... అతని అభివాదము పెడమొగంతో కొంచెం నిక్కగా అందుకున్నాడు...

'ఏమోయ్... ఎలా ఉన్నావు ?' అన్నాను...

'కులాసాగా ఉన్నానండీ... మీాదర్శనానికి రావాలనే అనుకుంటూన్నాను... టెన్నిస్ మాచెస్‌కు వెళ్ళి నిన్ననే వచ్చాను... అందుచేత...'

'... సరే,... రేపు కలుసుకుందాము, తీరికగా... డాక్టరుగారియింట్లో...' అని అతన్ని పంపించి వేశాను.

'ఏరా... మంచం ఎక్కడానికి బదులు... సైకిలెక్కి ఝుమాయించి పోతున్నాడే... ఏమిటీ మిరకిల్...' అని నిల వేశాను, డాక్టరును. గుక్కతిప్పుకోలేక పోయినాడు.

'ఎలా ఉన్నాడు యిప్పుడు ?—'

డాక్టరు నీరసంగా... 'బాగానే ఉన్నాడ'ని... ఉ నూరుమన్నాడు.

'ఎందుచేత... ఎలా ?... నీమందే పనిచేసిందంటూ వా, నీకే నమ్మకంలేకపోయినా: నీకన్న గొప్పవాడు చేపట్టి... కుదిర్చాడంటూవా ?...'డాక్టరుకు... అన్నీ గొంతున పడ్డవి.

'పోరా... ఎవరికర్మం వారిది ... ఎంతచేసినా ... ఎవరికో యింకొకరికామాట దక్కుతుంది!' అన్నాడు నిర్వేదంతో... యింటికివెళ్లి నడుం వాల్చిన తరువాత.

మీకు మాట దక్కితే చాలునుగా; ఏంరామరి, రేపు, వాడు ఫీజు తీసుకువచ్చి యిస్తాడుగాని, మరియాదగా పుచ్చుకుని .. ఏసనాతనుల సభకైనా ధర్మం చేయి...'

'ఏం' అని తల ఊగించాడు డాక్టరు...

'మెదడును ఏమాత్రం వాడనిజాతి, మీ తరువాత అది ఒక్కటే...'

'డిఫర్ మేషణ్...'

—కాదోయ్! 'డి' కాదు 'రి' ఉన్నమాట ముఖంమీద నే ఒకసారికి పదిసారులు అనేస్తే... ఉలికి... లేకపోతే, ఏమిటిరా యింతవరకూ మీరుచేస్తున్న నిర్వాకం ?... గడియారం యెడమచేతిలోలేందీ ... నాడి చూడలేరు: చూచినా ... ఒంట్లో ఏలావున్నదీ.. .జబ్బుఏమిటో, రోగి... మీకు పాఠం చెపితేనేకాని అర్థం చేసికోలేరు. యిందులో, యీ సర్వజ్ఞత్వానికి తోడు... నాలుగుసార్లు తొందరగా అటూఇటూ తిరగడం... అవతల వాడిన కసరడం... అసలే వాడు ఎంతో ఆదుర్దాతో, ఏదో ఉద్ధరిస్తారుకదా అనివస్తే ... మీ హంగా మాకూ భేషజానికి.. .నిజంగా, ఖాయిలా వచ్చేట్టుగా చేస్తారు తరువాత... కుదిరేభారం భగవంతుని అనుగ్రహంమీద... వాళ్లువాళ్లు చేసికున్న... కర్మమీద...

'అయితే... యిక మేమెందుకూ ?'

‹అడేరా నేను యిందాకటినుంచీ వేస్తున్న ప్రశ్న, భాయీ అంటే కోపంకాని. . . నీమటుకు నీవేంచేస్తున్నావు చెప్పు ?. . . యింట్లో ఎవరికైనా జబ్బుచేస్తే ఏడుకొండలవాడికి మ్రొక్కు కోవడం. . . ముడుపు కట్టడం. . . తాయెతులు కట్టించడం. . . విభూతి పెట్టించడం . . . దొడ్డివసారాలో, రంగాచార్యులు కూర్చుని కలవంలో నూరించి మాత్రలుకట్టి యివ్వడం . . మీదా కా వచ్చినప్పుడు. . అంతే యితరులకైతే. . యిన్నిరంగు నీళ్లు . .

‹ఎక్కడనుంచి. . . ఎక్కడకు తీస్తున్నావు . . . నీ వనే మాట ఒకటైనా సబబుగా ఉందా ? . . .

‹—ఉండదు. . . ఉంటే నీ కర్థమౌతుందా ? ఎందుయ్‌కో యింకా మోరాయింపు ?. . . శేఖరం సంగతి ఏమిటి చెప్పు...’

‹నాకు తెలియదంటున్నావుగా. . . నీవేచెప్పు. . ?

అంతా వివరంగా, ఆతడికి అర్థమయ్యేట్టు చెప్పాను. . .

. . ‘వయసువస్తున్న కుర్రవాళ్ళకు . . . సాధారణంగా ఎవరికో ఒకరికి తప్పు. . . అలా తప్పని సరిగా. . . తెలియకుండా నడుముసడలు తూండటం. . . సరే. . .

‘యిక్కడ ఏం వచ్చిందంటే. . . మనసులో ఆ అమ్మాయిని నిలుపుకుని, తరువాత, అసహ్యమే అయినా, అందులోనూ ఏదో తృప్తి పొందుతున్నాడు. . . వాంఛతో ముదిరించుకున్న వ్యాధి. . అరికట్ట డానికి ఆతని ఆ తత్వానికి అలవి కానిదై పోయింది. . .

‹ఇది తెలియక, నీవద్దకు వచ్చాడు. నీకూ అంతతెలివి లేకపోయింది. సామాన్య విధానాలన్నీ, అతనిమీాద ఉపయో

గించి చూశావు. సంసారం చేయించావు. . . కాని శకుంతలనే కాదు, సుబ్బులును తీసుకువచ్చి వాడికిఅంటకట్టినా. . .మనము అసలు దానిని ఏమీ అరికట్టకలిగే వాళ్ళముకాము.

'మనసులో బొమ్మను. . .మనసుచేతనే చెరిపేయించాలి. మనసుకు రోషం ఎక్కితే. . .మనచేతకాని ఘనకార్యం . . . సమూలంగా. . .నిమిషంలో, అది చేసేస్తుంది.

'శేఖరం. . .అవాళనుంచే బాగుపడింది. . .

'అన్నీ ఆలా ఒనగూడటంకాదు. . .నేను ఆలోచించి. . తెలివిమీద చేసినపనే అది. . .సుబ్బులు. మండువేసగిలో మిట్ట మధ్యాహ్నం . .అంత అసహ్యంగాను ఉంటుందన్న సంగతి నాకు తెలిసినదే . . . నేను అనుకున్నంత భీభత్సంగా లేకపో నా. .రోహిణి ముదరలేదుగా . .అదే వాడికి తల మున్కలైంది.

'ఆదెబ్బకు. . .దిమ్మ తిరిగిపోయి. . .సరిఅయిన ధోరణికి . . .తనంతట తానే మళ్ళాడు. ఎప్పటికి యిలాటి జబ్బు పడడు. కర్మం చాలక. . .ఒకవేళ పడే సందర్భమేఅంటూ వచ్చినా. . . మీ సేవ చేయడానికి రాడు. . .

—డాక్టరు. . .సిగ్గులేకుండా . . . నవ్వుతూ 'యిప్పటికి నీ మనసు చల్లబడిందా. . .' అన్నాడు . . .వెక్కిరించాడు. . .

. . .మరునాడు ఎదురుగుండా మేడమీద. . .గ్రామఫోను మోతలో గొంతులు కలిపి. . .శకుంతల, 'చ-ల్లా నా-యే-నూ-లేరా. . .నాసామి మువ్వగోపాళా. . .' ఘనా జటాగా పాడు తూన్నది; క్రింద, మనోహరం . . . ఎవరిమీదనో, రోజుకన్న ఎక్కువగా అరుస్తున్నది. . .